కృష్ణకుమారికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: తనకు వచ్చే వేతనం నుంచి నిరుపేద గిరిజనులకు ఎంతో కొంత సేవలందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్న తనకు ఉత్తమ అవార్డు రావడం ఆనందంగా ఉందని మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఏజెన్సీ రాష్ట్ర విభజన అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి తెలిపారు.కోవిడ్ కష్టకాలంలో కోవిడ్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజన గ్రామాల్లో ప్రచారం చేయడంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో శానిటైజర్లు ఆమె పంపిణీ చేశారు. వయోవృద్ధులు, నిరుపేద మహిళలకు దుప్పట్లు, చీరలు అందజేస్తున్నారు. దీంతో, ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో మంగళవారం జరిగిన 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆమెకు ఉత్తమ అవార్డును అందజేశారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డు ఇవ్వడంపై మండలంలోని గిరిజనులు హర్ష వ్యక్తం చేశారు.

అవార్డు స్వీకరిస్తున్న కృష్ణకుమారి

డ్రాపౌట్ల వివరాలు సేకరించండి

-నాడు - నేడు బిల్లులు అప్ లోడ్ చేయండి-జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పాఠశాలలలో విద్యార్థుల డ్రాప్ అవుట్ల వివరాలు సేకరించి, వారు పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం నుండి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులను గుర్తించి డ్రాప్ ఔట్‌కు కారణాలను విశ్లేశించాలని, ఆయా గ్రామాలకు వెళ్లి వాలంటీర్లు, పంచాయతి కార్యదర్శులు, సంక్షేమ సహాయకుల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 20 వేల పైగా డ్రాపవుట్లు ఉండవచ్చుని, దీనిపై అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కసరత్తు చేయాలని ఆదేశించారు. పాఠశాలలకు అందిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ వెంటనే ఇన్స్టాల్ చేయాలని, ప్రాజెక్ట్ అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నాడు- నేడు పనులు వేగవంతం చేయాలని, పూర్తైన పనులకు సంబంధించి బిల్లులను వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని తెలిపారు.ఏ రోజుకారోజు నిరంతరం అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. మండల విద్యాదికారులు, సహాయ గిరిజన సంక్షేమాదికారులు ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఆదేశించారు. ఫేజ్ -2 కు సంబంధించి ఎంఓయులను అప్ లోడ్ చేయాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలలో సక్రమంగా మెనూ అమలు చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ రెండవ తేదీ నుండి 31 తేదీ వరకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఐదు క్రీడలకు సంబంధించి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. వాలీ బాల్, కబడ్డీ, ఖో-ఖో, క్రికెట్, బాడ్మింటన్ ఐదు క్రీడల నిర్వహణకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు వివిధ కమిటీలు ఏర్పాటు చేయటం జరిగిందని, జిల్లాలో 64 కేంద్రాలు ఎంపిక చేయటం జరిగిందని కలెక్టర్ తెలిపారు. 17 సంవత్సరాలు నిండిన మహిళలు, పురుషులు

మాట్లాడతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఈ క్రీడా పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి సంబంధిత సచివాలయాలలో నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో గెలుపొందినవారు మండల స్థాయి, జిల్లా స్థాయికి వెళతారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడా జట్లు విశాఖపట్నం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనవలసి ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా విధ్యాశాఖాదికారి సలీం భాష, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు కొండలరావు, పాడేరు డివిజన్ సహాయ గిరిజన సంక్షేమాదికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, జిల్లా క్రీడాదికారి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘర్షణ పడుతున్న ఇరు వర్గాల నేతలు

వైసిపిలో భగ్గుమన్న విభేదాలు

ఎమ్మెల్యే ఫాల్గుణ, వ్యతిరేక వర్గీయుల తోపులాట

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ వైసీపీ పార్టీలో ఒకసారిగా విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే పాల్గుణ వ్యతిరేక వర్గీయులు వైసిపి రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ముందు విభేదాలు భగ్గుమన్నాయి. అరకులోయలోని పున్నమి వ్యాలీ రిసార్ట్స్‌లోని గోష్టిలో భాగంగా అరకు నియోజకవర్గంలోని వైసీపీ నేతలు కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ కలయిక సమావేశంలో పాల్గొనడానికి వైవి సుబ్బారెడ్డి బుధవారం సాయంత్రం అరకులోయ పున్నమికి చేరుకున్నారు. సుబ్బారెడ్డి రాకకు నిరీక్షించిన కొంతమంది వైసిపి కార్యకర్తలు అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వ్యతిరేక వర్గీయులు వైవి సుబ్బారెడ్డి వాహనం దిగిన వెంటనే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వద్దు- జగన్ ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసి గుమ్మిగూడారు. దీంతో, ఒక్కసారిగా వైసిపి ఇరువర్గాల్లో కలవరం మొదలై గందరగోళ పరిస్థితి ఏర్పడింది.ఇరు వర్గాల మధ్య కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు జోక్యం చేసుకొని వెంటనే ఇరు వర్గాల వారికి సర్ది చెప్పి సభ సజావుగా సాగేలాగా చేశారు. దీంతో, అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా అంతకుముందు పార్టీ కార్యకర్తల మధ్యనే ఫ్లెక్సీలు పెట్టే విషయంలో నాది ముందు ఉండాలంటే మాది ముందు ఉండాలంటూ ఘర్షణ పడ్డారు. వైసిపి ఇరువర్గంలో వర్గ విభేదాలు బయట పడటంతో ముందు ముందు అరకు వైసిపిలో పరిస్థితి ఎలా ఉంటుందని అందరూ తలలు పట్టుకుంటున్నారు.

మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి సుబ్రహ్మణ్యేశ్వరి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రస్తుత వర్షాకాలంలో దోమల ద్వారా ప్రబలే సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికన్ గున్యా వ్యాధులపై ప్రజలకు అవగాహన, అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకోవాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి ఆదేశించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని సహాయ మలేరియా అధికారి, విబిడి కన్సల్టెంట్, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్లతో సమీక్ష సమావేశం స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ మలేరియా అధికారి మాట్లాడుతూ జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీ ఏరియాలో రెండో విడత ఐఆర్ఎస్ చేయడం, అన్ని హాస్టళ్లలో ఫోకల్ స్ప్రే (క్రిమి సంహారక మందు పిచికారీ) చేయించడం, ఫీవర్ సర్వే, లార్వా సర్వే, దోమ లార్వా ఉన్నచోట యాంటీ లార్వాల్ ఆపరేషన్స్ చేయడం, బయోలాజికల్ కంట్రోల్ చేయుటకు గంబూసియా చేపలను చెరువుల్లో, కొలనుల్లో విడుదల చేయడం కోసం సత్వర ప్రణాళికతో కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన సదస్సులు, ఇంటి ఆవాసల దగ్గర్లోని కాలువలలో చెత్త, చెదారం వేయకుండా ఆచరణ నియమావళిలో మార్పు రావడం చేసేలా చూడాలని సూచించారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

వైసిపి ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-పాడేరు: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మెడికల్ కాలేజీ, ఉత్తరాంధ్రలో ట్రైబల్ యూనివర్సిటీ వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి వెల్లడించారు. స్థానిక వీఆర్ కళ్యాణ మండపంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాడేరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అవినీతికి తావు లేకుండా వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలని గతసారి మాదిరిగానే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల్ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు వంటి దుష్టులు ప్రభుత్వ పాలన పైనా, వాలంటీర్ వ్యవస్థ పైనా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. 2024లో మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని అన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించిన వాలంటీర్ వ్యవస్థపై పవన్ కళ్యాణ్ దుష్ప్రచారం చేస్తున్నారని, డేటా చౌర్యం పేరుతో తప్పుడు ఆరోపణ చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లిద్దరు ప్రభుత్వం చేస్తున్న మంచిని తట్టుకోలేక రాజకీయ లబ్ధి కోసం వాలంటీర్ వ్యవస్థను తప్పుపట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర, జిసిసి చైర్పర్సన్ స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, నియోజక వర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడేరులో హాజరైన సుబ్బారెడ్డి, నాయకులు

అరకులోయ:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేశారని వైసిపి కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం అరకులోయకు వచ్చిన ఆయన స్థానిక రిసార్ట్స్‌లో నియోజకవర్గం నేతలు, పార్టీ కార్యకర్తలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనులు అంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అమితమైన ప్రేమ ఉందని ఆయన అన్నారు. సచివాలయాల ఏర్పాటుతో అవినీతి లేకుండా పథకాలు పొందవచ్చునన్నారు. వైయస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఆయన అన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కే భాగ్యలక్ష్మి,జడ్పీ చైర్మన్,జల్లిపల్లి సుభద్ర, జిసిసి చైర్మన్ శోభ స్వాతిరాణి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి దేవి, డైరెక్టర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి

రాయితీపై కిసాన్ డ్రోన్ల సరఫరా

ప్రజాశక్తి-కొయ్యూరు

రైతులకు రాయితీపై కిసాన్ డ్రోన్లు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాదేవి తెలిపారు. మండలంలోని మర్రివాడ రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించి, ఈ-పంట నమోదు, ఇతర అంశాలపై చర్చించారు. రైతులతో మాట్లాడి కిసాన్ డ్రోన్లు, వాటి వినియోగం గురించి తెలిపారు. కిసాన్ డ్రోన్ ఖరీదు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంటుందని, దీన్ని ప్రభుత్వం వారు రాయితీ మీద సరఫరా చేస్తుందని చెప్పారు. గ్రూపుగా గాని, వ్యక్తిగతంగా గాని దీనిని పొందవచ్చని తెలిపారు. కిసాన్ డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారీ సులభతరంగా చేయొచ్చని, ఎకరానికి పిచికారీకి దాదాపు 20 నిమిషాల్లో సమయం సరిపోతుందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, వ్యవసాయ పాలిటెక్నిక్ చదువుకున్న వారు వీటిని పొందేందుకు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు రైతు భరోసా కేంద్రంలోగాని, మండల వ్యవసాయ కార్యాలయంలోగాని సంప్రదించాలని కోరారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం ఐటిడిఎ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతతో ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం 3వ తరగతి నుండి సబ్జెక్టు టీచర్లతో బోధిస్తామని చెప్తున్నప్పటికి ఆశ్రమ పాఠశాలల్లో మాత్రం ప్రభుత్వ విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రధానోపా ధ్యాయ పోస్టులు భర్తీ చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ సబ్జెక్టు టీచర్లను భర్తీ చేయడంలో చూపలేదని విమర్శించారు.గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ప్రమోషన్స్ సమస్య పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సి.హెచ్. నాగేశ్వరరావు, పి.దేముడు పలువురు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని లైగండ పంచాయతీ ఇసుకగరువు గ్రామంలో నూతన జిసిసి డిఆర్ డిపో భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం శిధిలావస్థలోనున్న డిపో వద్ద నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఆదివాసి రాష్ట్ర చైర్‌పర్సన్ పి.శాంత కుమారి మాట్లాడుతూ, గతంలో నిర్మించిన డిపో భవనం పూర్తిగా మరమ్మతుకు గురై శిధిలవస్థలో ఉండి ఎప్పుడైనా కూలి పోయే పరిస్థితిలో ఉందన్నారు.జిసిసి ద్వారా పంపిణీ అయ్యే బియ్యం, పప్పుతో పాటు ఇతర వస్తువులు తడిసి పాడవుతున్నాయన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి జిసిసి డిఆర్ డిపోకు నూతన భవనాన్ని నిర్మించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు పి.చిన్నస్వామి, ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ టి.సోమేశ్వరావు, మండల అధ్యక్షుడు జగన్నాథం, రాజబాబు, పరశురాం, అప్పారావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఉత్తమ సేవా పురస్కారం

మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తహశీల్దారు శ్రీధర్

ప్రజాశక్తి-విఆర్.పురం

గోదావరి వరదల సమయంలో నిబద్ధతతో ఉత్తమ సేవలు అందించినందుకుగాను వరరామచంద్రాపురం తహసీల్దార్ ఎన్.శ్రీధర్‌కు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాడేరులో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్ శ్రీధర్ ప్రజాశక్తితో మాట్లాడుతూ భారీ వర్షాలు, శబరి, గోదావరి నదుల ఉగ్రరూపం కారణంగా వదరలు రావడంతో ఇక్కడ ఉన్న వనరులను ఉపయోగించుకొని, తోటి సిబ్బంది సహాయ సహకారాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీవ్రంగా కృషి చేశామని తెలిపారు. ఏజెన్సీలో సేవలు చేయడం సంతోషంగా ఉందన్నారు. మండల ప్రజల ఆశీస్సులతో, పైఅధికారుల సూచనలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్శిస్తానని తెలిపారు.

రేఖపల్లి సెక్రటరీకి..

మండలక కేంద్రం రేఖపల్లి పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్‌కు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారం దక్కింది. పంచాయతీలో అంతత మాత్రంగానే నిధులున్నా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. రేఖపల్లి పంచాయతీని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో విజయం సాధించారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. విధినిర్వహణలో ప్రజల మన్ననలు పొందారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా అధికారులు ఉత్తమ ప్రతిభా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌ను పలువురు అభినందించారు.

కార్యదర్శి శివప్రసాద్

రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- అడ్డతీగల

అడ్డతీగలలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో గల కృపా అనాధాశ్రమం వద్ద బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ జి.భాస్కర్, అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రాంబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు పాస్టర్.నిస్సి కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లో రక్తహీనత కలిగిన వారికి, గర్భిణులకు అత్యవసర సేవలు అందించడానికి రక్త నిల్వలు లేవని, ఎడిఎంహెచ్ఒ భాస్కర్ సలహా మేరకు ఈ శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. శివిరంలో 16 మంది నుండి 16 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పలువురు పాస్టర్ నిస్సి కుమార్‌ను అభినందించారు.

వైస్ ప్రిన్సిపల్ పద్మలతకు ఘన సన్మానం

ప్రజాశక్తి - అరకులోయ : అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పద్మలతకు ఆ కళాశాల ప్రిన్సిపల్ భరత్ కుమార్ నాయక్, సిబ్బంది ఘనంగా వీడుకోలు పలికారు. అరకులోయ వైస్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యార్థులతో మమేకమై విద్యార్థులను క్రమశిక్షణ మార్గంలో నడిపించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించి విశాఖపట్నంకి వెళ్తున్న పద్మలతకు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్ నాయక్ మాట్లాడుతూ, వైస్ ప్రిన్సిపల్ పద్మలత కళాశాలలో తల్లి పాత్ర పోషించారని ఆమె సేవలను కొనియాడారు. విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో ఆమెకు వీడుకోలు పలికారు. మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత మయూరి రాజారావు, సీనియర్ పాత్రికేయుడు ఎల్‌బి వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మలతను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

ఉత్తమ సేవకులకు సిపిఎం సత్కారం

ప్రజాశక్తి-కూనవరం

ఉత్తమ సేవలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ సుమిత్ కుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులకు సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు. ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న మండల తహసీల్దార్ అనసూయ, స్థానిక ఎస్ఐ బి.వెంకటేష్, మేజర్ పంచాయతీ కార్యదర్శి సురేష్‌లను సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు వారి వారి కార్యాలయాల్లో కలిసి వారిని దుస్సాలువాలతో సత్కరించి, స్వీట్లు తినిపించారు. సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ వరదల్లో అధికారులు చేసిన సేవలు మండల ప్రజలు ఎన్నటికీ మరచిపోరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సర్పంచ్ నాగమణి, బొగ్గా వెంకమ్మ, శ్యామల కృష్ణ, తాళ్లూరి శ్రీనివాసరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ వెంకటేష్‌ను సత్కరిస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు

23న బియ్యం వేలం

ప్రజాశక్తి-పాడేరు

ప్రజా పంపిణీ వ్యవస్థ కు చెందిన బియ్యం అక్రమ రవాణా చేసిన వారి నుండి నిల్వలు సీజ్ చేసి, వారిపై 6ఎ కేసులు నమోదు చేయడం జరిగిందని సంయుక్త కలెక్టర్ జే. శివ శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధంగా సీజ్ చేసిన 113 టన్నుల బియ్యాన్ని ఈ నెల23న బహిరంగ వేలం వేయనున్నామని ఆయన తెలిపారు. జిల్లాలోని పాడేరు, జి.మాడుగుల, కొయ్యూరు, పెదబయలు, చింతూరు, రంపచోడవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండల స్థాయి గోదాములలో భద్రపరిచామన్నారు. వెయ్యి రూపాయల దరఖాస్తు రుసుముతో పాటు రూ.20 వేల డి.డి. తీయాలని సూచించారు. వ్యాపారి, రైస్ మిల్లర్ కు తప్పనిసరిగా జి.ఎస్.టి ఉండాలన్నారు. పూర్తి వివరములకు పాడేరు కలెక్టరేట్ ప్రాంగణములో జిల్లా పౌరసరఫరాల కార్యాలయములో సంప్రదించాలన్నారు.

సంతకాలు సేకరిస్తున్న చిన్నయ్యపడాల్

చింతపల్లిలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-పాడేరు: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం అన్యాయం చేస్తుందని పవర్ జేఏసీ ఒప్పందాన్ని వ్యతిరేకించాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గత రెండు రోజులుగా పవర్ జేఏసీ వేతన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చింతపల్లిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, చింతపల్లి సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు, ఉద్యోగులకు తెలపకుండా అంగీకారం లేకుండా పవర్ జేఏసీ ఒప్పందం చేసుకోవటం అర్థరహితమన్నారు. ఈనెల 9న. రాష్ట్ర మంత్రులు ఉన్నత అధికారులతో పవర్ జేఏసీ నాయకత్వం చేసిన విద్యుత్ వేతన ఒప్పందాన్ని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు, కాంట్రాక్ట్ కార్మికులంతా ఒకే వేదికపైకి వచ్చి న్యాయమైన వేతనం ఒప్పందాన్ని సాధించడానికి అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. పవర్ జేఏసీ కాంట్రాక్టు కార్మికులపై ఒప్పందం చేసే అధికారం లేదని 3డిఏలు పెండింగ్ ఉంటే ఒక డి ఎ మాత్రమే అది కూడా 12 వాయిదాలలో చెల్లింపునకు పవర్ జేఏసీ అంగీకరించిందని గుర్తు చేశారు. ఐక్యతతో డిమాండ్ల పరిష్కారంకి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, పోతురాజు, ఎర్రం దొర, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు

వార్షిక ఇంక్రిమెంట్లు, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : ఆర్టీసీ ఉద్యోగులకు ఎఎస్, వార్షిక ఇంక్రిమెంట్లు, పిఆర్‌సి బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖపట్నం రీజినల్ కమిటీ ఆధ్వర్యాన ఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పివి.రమణారెడ్డి, రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం మాట్లాడుతూ, విశాఖ స్టీల్ సిటీ డిపోలో ఉద్యోగులను డిపో మేనేజర్ తీవ్రస్థాయిలో వేధిస్తున్నారని, మేనేజర్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రేడ్-1 ఇంక్రిమెంట్ బకాయిలు చెల్లించాలని, సిక్ ఉద్యోగులకు జీతం చెల్లించాలని, గతంలో జారీచేసిన ఎడిసి సఫ్లింగ్ ఉత్తర్వులను అమలు చేయాలని, ఎపి జిఎల్ఐ బాండ్లను అందించాలని, మహిళా ఉద్యోగుల విశ్రాంతి గదిని పొడిగించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండి శివరామకృష్ణ, కూర్మన్నపాలెం డిపో కార్యదర్శి డి.సాయిరాం, గాజువాక డిపో కార్యదర్శి పి.శంకరరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- హౌసింగ్ స్పెషల్ సెక్రెటరీ బిఎం.దివాన్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ స్పెషల్ సెక్రెటరీ బిఎం.దివాన్ అన్నారు. బుధవారం సాయంత్రం విశాఖ కలెక్టరేట్‌లో జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లే-అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలూ చేపట్టాలని సూచించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయుటకు అవసరమైన విద్యుత్, సిమెంటు, ఇసుక తదితర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచాలని, సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ సౌకర్యాలను ఏర్పాటుచేయాలని సూచించారు. లే-అవుట్‌లలో ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. లబ్ధిదారులందరికీ బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయాలని చెప్పారు. ప్రతి లే-అవుట్ కాలనీలో ముఖ ద్వార ఆర్చ్‌ను త్వరితగతిన నిర్మించాలన్నారు.

పివిటిజిల సమస్యలపై...

18న చలో పాడేరును విజయవంతం చేయండి

గిరిజనులనుద్దేశించి మాట్లాడుతున్న బాలదేవ్

ప్రజాశక్తి- అరకులోయ:పాడేరు ఐటీడీఏ పరిధిలో నివసిస్తున్న పీవీపీజీల సమస్యలు పరిష్కారానికై ఈనెల 18న చేపట్టే చలో పాడేరు కార్యక్రమం విజయవంతం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. అరకులోయ మండలం గొందివలస గ్రామంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాడేరు ఏజెన్సీ పరిధిలో కోదు, పరేంగిపోర్జ, గదభ, ఖోర్జ తెగలైన పివిటిజీలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. పీవీటిజిల జీవన ఆధారమైన అంత్యోదయ కార్డులు రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పివిటిజి గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన సీసీడీపీ నిధులు దారి మళ్లిస్తున్నారని విమర్శించారు. సిసిడిపి నిధులతో పివిటిజి గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, అంగన్వాడి భవనాలు, పాఠశాల భవనాలు, సామాజిక భవనాలు నిర్మాణం చేయాల్సి ఉన్నప్పటికీ 2019 నుండి నేటి వరకు ఐటీడీఏ పరిధిలో సిసిడిపి నిధుల ద్వారా ఒక్క పని కూడా చేయకపోవడం పీవీపీజీలకు అన్యాయం చేయడ మేనని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఒక్క అంత్యోదయ కార్డు కూడా మంజూరు చేయకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. వీరికి ఇవ్వాల్సిన వ్యక్తిగత ట్రైకార్ రుణాలు, టిఎఫ్సి నిధులతో మేకలు, గొర్రెలు, పశువులు వ్యవసాయ యంత్రాలు ఇలా ఏవీ కూడా ఇవ్వలేదన్నారు. పీవీపీజీ గ్రామాలకు రోడ్లు, వంతెనలు లేక పోవడంతో డోలిమోతలతో అనేకమంది గర్భిణీలు ప్రాణాలను కోల్పోతున్నారని, తక్షణమేరోడ్లు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 15 వేల కోట్ల పీవీటిజిల బడ్జెట్ నిధులు పాడేరు ఐటీడీఏ పరిధిలో గ్రామాల అభివృద్ధికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 18 నిర్వహిస్తున్న చలో పాడేరు కార్యక్రంలో పివిటిజీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రకాష్ రాజు, సాంబమూర్తి, రాజు, మల్లన్న, లతశ్రీ పాల్గొన్నారు.

వైభవంగా ఎపిఎల్-2 ప్రారంభం

క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న సినీ నటి శ్రీలీల

ఎపిఎల్ ప్రారంభంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి -పిఎం పాలెం : వైజాగ్ వేదికగా ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2 బుధవారం వైభవంగా ప్రారంభమైంది. సినీ హీరోయిన్ శ్రీలీల గౌరవ అతిథిగా హాజరై క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసేందుకు బిసిసిఐ సహకారంతో ఎపిఎల్ సీజన్ - 2 నిర్వహిస్తున్నామని తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీజన్-1 మంచి ఫలితాలు ఇచ్చిందని, ఇందులోని పలువురు క్రీడాకారులు ఐపిఎల్లో స్థానం దక్కించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విడిసిఎ అధ్యక్షులు విష్ణు కుమార్‌రాజు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, కలెక్టర్ ఎ.మల్లికార్జున జివిఎంసి మేయర్ జి.హరివెంకట కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై దృష్టి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయుటకు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబ లో వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి వారమూ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటులో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. రాజకీయ ప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యలు తెలియజేస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, వైసిపి, టిడిపి, బిజెపి, బిఎస్‌పి ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖుర్ధా రోడ్ - విజయనగరం మధ్య

మూడో రైల్వే లైన్‌కు కేంద్రం ఆమోదం

- డిఆర్ఎం సౌరవ్ ప్రసాద్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధి వాల్తేర్ డివిజన్‌లోని కుర్ధారోడ్ - విజయనగరం మధ్య మూడో లైన్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరవ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం డిఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారని, అందులో కుర్ధా రోడ్ - విజయనగరం మూడో లైన్‌కు 385 కిలోమీటర్ల దూరాన్ని రూ.5618 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు ఆమోదం తెలిపారని వివరించారు. ఈ మూడో లైన్‌లో ఆరు రైల్వే వంతెనలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని 184 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 201 కిలోమీటర్ల మేరకు నూతన ట్రాక్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ మూడవ లైన్ నిర్మాణం ద్వారా దక్షిణ భారతదేశంలో బొగ్గు రవాణా సులభతరం అవుతుందని చెప్పారు.

పారాదీప్, గోపాల్పూర్ పోర్టులతోపాటు ఒడిశా రాష్ట్రంలోని స్టీల్‌ప్లాంట్లకు రవాణా సులభతరం అవుతుందన్నారు. విశాఖపట్నం, గంగవరం పోర్టులకు, ఒడిశా స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా సులభతరం అవుతుందని తెలిపారు. వాల్తేర్ డివిజన్ పరిధిలోని నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు ఇటీవల రూ.800 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వీటిలో దువ్వాడ-సింహాచలం మధ్య 20.54 కిలోమీటర్ల మూడు, నాలుగు లైన్లకు రూ.302 కోట్లు, వడ్లపూడి గేట్ జంక్షన్ నుంచి గంగవరం పోర్టు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్లకు 12 కిలోమీటర్లకు రూ.154 కోట్లు, పెందుర్తి-సింహాచలం నార్త్ స్టేషన్లో ఫ్లై ఓవర్ ప్రాజెక్టుకు రూ.183 కోట్లు, గోపాలపట్నం-విశాఖపట్నం మధ్య 15.3 కిలోమీటర్లకు గాను రూ.159.47 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

వీటిలో మొదటి మూడు ప్రాజెక్టులకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. నాలుగో ప్రాజెక్టుకు త్వరలోనే టెండర్ల ఆహ్వానిస్తామన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాయగడ, విశాఖపట్నం స్టేషన్ల పునర్నిర్మాణానికి ఇప్పటికే పలు డిజైన్లు కేంద్రానికి సమర్పించామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధి, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై...

19 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : విద్యారంగ అభివృద్ధి, సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధిచేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విశాఖ జిల్లా మొత్తం సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సైకిల్ యాత్ర ఈ నెల 19న భీమిలిలో ప్రారంభమై 22న గాజువాకలో ముగుస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని నాశనం చేసే విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను తిరోగమన దిశలో నడిపిస్తోందన్నారు. విద్యారంగం ప్రయివేటీకరణకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూనుకుంటుందని విమర్శించారు.

సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, నేడు - నేడు ద్వారా మరమత్తులకు నిధులు కేటాయించాలని, పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని, సన్న బియ్యం సరఫరా చేయాలని, జిఒ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు విద్యా దీవెన అందించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, వైద్య విద్యార్థుల పాలిట శాపంగా మారిన జిఒ 107, 108 రద్దు చేయాలన్న డిమాండ్లతో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘర్షణ సైకిల్ యాత్ర నిర్వహిస్తుందన్నారు. ఈ సైకిల్ యాత్ర ద్వారా జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను, సంక్షేమ హాస్టళ్లను, పాఠశాలలను సందర్శించి సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.రాము, నాయకులు ఎం.గుణ, హర్షిత్, తులసీరామ్ పాల్గొన్నారు.

నేడు సిపిఐ జాతా ప్రారంభం

ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లాంటి ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించడంతో పాటు 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' నినాదంతో ఈనెల 17న ఉదయం 10 గంటలకు కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి సిపిఐ జాతా ప్రారంభం కానుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ తెలిపారు. బుధవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. జాతా ఏర్పాట్లను పరిశీలించారు. వచ్చేనెల 8న తిరుపతిలో ముగిసే వరకు సిపిఐ బస్సు యాత్ర కొనసాగుతుందని, ప్రారంభోత్సవ కార్యాక్రమంలో ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పాల్గొంటారన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులతో పాటు కార్మికులు నిర్వాసితులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జాతాను విజయవంతం చేయాలన్నారు.

ఎయు టాపర్‌గా సెయింట్ ఆన్స్ విద్యార్థిని

ప్రజాశక్తి -ములగాడ : బిఎస్‌సి, ఎంపిసి ఫలితాల్లో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని సూరిశెట్టి వసంతలక్ష్మికి ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో ఫస్ట్‌ర్యాంకు లభించింది.. మూడేళ్ల మార్కులకు 9.86/10 గ్రేడింగ్ పాయింట్లు సాధించి ఎయు టాపర్‌గా నిలిచింది. వసంతలక్ష్మి ప్రతిభపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, తోటి విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో వసంతలక్ష్మిని కాలేజీ యాజమాన్యం ఘనంగా సత్కరించి, అభినందించింది.

వసంతలక్ష్మి ఇంటర్మీడియట్‌లోనూ సెయింట్ ఆన్స్‌లో చదివి 10/10 పాయింట్లు సాధించింది.సామాన్య కుటుంబానికి చెందిన వసంతలక్ష్మి చదువులోనే కాకుండా ఎన్ఎస్ఎస్ వాలంటీరుగా, యూనిసెఫ్ ప్రాజెక్టులో పీర్‌లీడర్‌గా వ్యవహరించి బహుముఖ ప్రజ్ఞ కనబరుస్తూ కాలేజీకి మంచిపేరు, గుర్తింపు తేవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

మానసిక వ్యాధులకు ఉచిత వైద్యం

వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ తేజస్విని

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.గంగునాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మానసిక రోగులకు డాక్టర్ ఎన్ తేజస్విని ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ ఎవరైనా మోర్ఛ, మానసిక రుగ్మతలు, సైకోసిస్, నిద్రలేమి, తమలో తాము నవ్వుకోవడం వంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే, వారిని పిహెచ్‌సికి తీసుకురావాలని, ఉచితంగా వైద్యసేవలతోపాటు మందులు అందిస్తాన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ పి. సాంబమూర్తి, పిహెచ్ఎన్ టి.కృష్ణవేణి, మానసిక ఆరోగ్య సోషల్ వర్కర్ జి సత్తిబాబు, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

ఆశావర్కర్ల పట్ల చులకన భావం తగదు

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆశా వర్కర్ల పట్ల చులకన భావం మానుకోవాలని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపడం తగదని ఆశావర్కర్ల సంఘం, విశాఖ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.మణి విమర్శించారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బుధవారం రామా టాకీస్ దరి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించి ,వేధింపులు, ఒత్తిళ్ల లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆశావర్కర్లతో ఇంజిక్షన్ బాక్సులు మోయిస్తూ చులకనగా చూడడం మానుకోవాలని డిమాండ్ చేశారు. సెల్‌ఫోన్ సమస్య పరిష్కరించాలని కోరారు. ఆశాల సమస్యలపై స్పందించి పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేయక తప్పదని హెచ్చరించారు.ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై డిఎంహెచ్ఒ స్పందిస్తూ, ఆశావర్కర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తానని హామీఇచ్చారు.

అదనపు టోల్ ఫీజు వసూలును నిరసిస్తూ ధర్నా

అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తున్న లారీ ఓనర్స్

ప్రజాశక్తి -గాజువాక : అదనపు టోల్ ఫీజు వసూలును నిరసిస్తూ అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గాజువాక, అనకాపల్లి జివిఎంసి పరిధిలో ఉన్నప్పటికీ, ఆ రెండు ప్రాంతాలు విశాఖ జిల్లాలో లేవని టోలుప్లాజా నిర్వాహకులు అదనపు టోల్ ఫీజు కట్టాలని ఒత్తిడిచేసి కట్టించుకోవడం దుర్మార్గమన్నారు సబ్బవరం టోల్ ప్లాజా వినియోగంలోకి వచ్చి రెండేళ్లు గడస్తున్నా ఇచ్చిన మాట ప్రకారం అగనంపూడి టోల్‌ప్లాజా తొలగించకపోవడం దారుణమన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కేశవరపు శ్రీను మాట్లాడుతూ అనకాపల్లి, గాజువాక జివిఎంసి పరిధిలో ఉన్నప్పటికీ, గాజువాక ఆర్‌టిఒ పరిధి అనకాపల్లి జిల్లాలో ఉండడంతో విశాఖ జిల్లాకు నాన్‌లోకల్ అంటూ ఒకవైపు రూ.335, రెండోవైపు రూ.165 చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. గతంలో రెండు వైపులా చెరో రూ.165 వసూలు చేసిన టోల్‌ప్లాజా కాంట్రాక్టర్లు కుంటిసాకులతో రెట్టింపు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. గడచిన మూడు రోజులుగా వాహనదారులకు ఎటువంటి సమాచారం లేకుండా ఫాస్ట్ ట్రాక్‌లో టోల్ ఫీజు అదనపు ఛార్జీలు కట్‌చేసి వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని, అదనంగా కట్ చేసి టోల్‌ఫీజును వాపసు చేయాలని కోరారు.

దీనిపై దువ్వాడ సిఐ బి.శ్రీనివాసరావు సూచనలతో టోల్‌ప్లాజా కాంట్రాక్టర్లు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిగాయి. గాజువాక ఆర్‌టిఒ పరిధిలోని లారీలకు పాతపద్ధతిలో లోకల్ టోల్ ఛార్జీల వసూలుకు అంగీకారం కుదిరింది. లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నాయకులు పినబాల మహేష్ అధ్యక్షతన జరిగిన ఆందోళనలో లారీ ఓనర్స్ నెల్లి శ్రీనివాసరావు, గొన్న తాతారావు, జాజుల సూరిబాబు, కోట్ని శ్రీను, జి రామారావు, గొల్లవిల్లి శ్రీను, విందుల నర్సింగరావు, రాజు, వెంకటరావు, పలువురు లారీ ఓనర్స్, డ్రైవర్లు పాల్గొన్నారు.

సర్ధార్ గౌతు లచ్చన్నకు ఘననివాళి

లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న బంకు సిబ్బంది.

ప్రజాశక్తి -గాజువాక : 72వ వార్డులో యాత శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షులు అండి బోయిన అప్పారావు ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 114వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, హైకోర్టు న్యాయవాది, ఎపి స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మీ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు చీరల పంపిణీ చేశారు.కార్యక్రమంలో పితాని శంకరరావు, పూడి రమణ, వెంపాడ అప్పారావు, వానపల్లి పైడిరాజు, చప్పిడి నాగరాజు, గెద్దాడ అప్పలరాజు, నెల్లి వెంకటరమణ, ఉండవల్లి శ్రీనివాసరావు, గొందేసి కుంచయ్య రెడ్డి, ఓడిబోయిన శంకర్, బత్తిన రాము నీలాపు అప్పారావు, ఓడిబోయిన అలేఖ్య అధిక సంఖ్యలో మహిళలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

షీలానగర్ అనురాధ పెట్రోల్ బంక్ వద్ద...

సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని షీలానగర్ అనురాధ పెట్రోల్ బంకు వద్ద లచ్చన్న విగ్రహానికి బంకు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లచ్చన్న ఆశయాలను ఆచరణలో పెట్టడానికి కలిసి పని చేయాలని నిర్ణయించారు.

నిర్వాసిత కార్మిక సమస్యలపై

నేడు అదానీ గంగవరం పోర్టు ముట్టడి

ప్రజాశక్తి -గాజువాక : వేతనాల పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 40 రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్న అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు ఈనెల 17న గంగవరం పోర్టు ముట్టడి ఆందోళన చేపట్టనున్నట్లు కార్మిక యూనియన్ నేతలు వెల్లడించారు. న్యాయమైన డిమాండ్లతో తాము ఆందోళన చేస్తుంటే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంతో తాడోపేడో తేల్చుకునే లక్ష్యంతోనే పోర్టు ముట్టడి చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ఆందోళనలో అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులతోపాటు, స్థానిక ఎమ్మెల్యే కూడా హాజరవుతారని కార్మికులు తెలిపారు. 40రోజులుగా నిర్వాసిత కార్మికులు ఉద్యమిస్తున్నప్పటికీ, యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందే తప్ప, కార్మికుల డిమాండ్లపై స్పష్టమైన వైఖరి ప్రకటించడం గానీ, లిఖితపూర్వక హామీ గానీ ఇవ్వడం లేదన్నారు అందుకే భారీఎత్తునముట్టడి ఆందోళనకు సిద్ధమైనట్లు వెల్లడించారు.

మధురవాడలో మిత్సుబిషి షోరూం

ప్రజాశక్తి-పిఎం.పాలెం: అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో మిత్సుబిషి అధునాతన ఎసిలను అందిస్తుందని సంస్థ డైరెక్టర్ నోహికో హాసోకవ వెల్లడించారు. బుధవారం జివిఎంసి ఆరో వార్డు పిఎం.పాలెం కార్ షెడ్ జంక్షన్ సమీపంలో మిత్సుబిషి ప్రత్యేక షోరూమ్‌ను కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ నీరజ్ గుప్తాతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా నీరజ్ గుప్తా మాట్లాడుతూ నగర ప్రజల జీవనవిధానంలో ఎంతో మార్పు వచ్చిందని, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ కల్చర్ బాగా పెరిగిందన్నారు. దీనికి తగ్గట్టుగానే అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో సంస్థ షోరూముల్లో విభిన్న వెరైటీలలో ఎసిలను అందుబాటులో ఉంచామన్నారు. షోరూం అధినేత యామీన్ మాట్లాడుతూ విశాఖలో మిత్సుబిషి ఆథరైజ్డు రెండో బ్రాంచిని మధురవాడలో అందుబాటులోకి తెచ్చామన్నారు. నాణ్యత, మన్నికతోపాటు పదేళ్ల వారెంటీతో జపాన్, థాయిలాండ్ నుంచి దిగుమతి చేసుకుని, వివిధ రకాల ఉత్పతులను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. అభిరుచి గల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రిలో

హోమ్ కేర్ సేవలు ప్రారంభం

- వృద్ధాశ్రమాలు, నిరుపేద రోగులకు కంటి వైద్యం లక్ష్యం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి, స్నేహ సంధ్య ఏజ్ ఫౌండేషన్ సహకారంతో వృద్ధాశ్రమాల్లోని రోగులకు కంటి పరీక్షలు, హోమ్ కేర్ సేవలను ఎల్‌వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో బుధవారం సినీ నటి శ్రీలీల ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ ధనవంతులకే పరిమితమౌతున్న హోంకేర్ సేవలను అనాథాశ్రమాల్లోని వృద్ధులకు, పేదరోగులకు వారి వద్దకు వెళ్లి అందించడం అభినందనీయమన్నారు. హోంకేర్ సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన స్నేహ సంధ్య ఏజ్ ఫౌండేషన్, ఎల్‌వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ అవినాష్ పతంగి మాట్లాడుతూ, క్యాంపస్‌కు 20కిలోమీటర్ల పరిధిలోని 25 వృద్ధాశ్రమాల్లో 1500 మందికి హోమ్‌కేర్ సేవలను అందిస్తామన్నారు. పేదలు, స్త్రీలు, పిల్లలు, వికలాంగుల కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహిస్తామన్నారు. ఆసుపత్రి ప్రధానాధికారి డాక్టర్ భావిక్ పంచాల్ మాట్లాడుతూ హోంకేర్ సేవలను విశాఖపట్నంలోనే కాక పరిసర ప్రాంతాలకు విస్తరించే ప్రతిపాదన ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కంటిచూపు ప్రమాదం రాకుండా నేత్ర వైద్యచికిత్స, సేవలను పేదలకు అందుబాటులోక తేవడమే లక్ష్యమన్నారు. శిక్షణ పొందిన టెక్నీషియన్స్ ఆశ్రమాలను సందర్శించి, కంటి సమస్యలు గుర్తించి, ప్రాథమిక సేవలు అందిస్తారని, అవసరమైన వారికి కంటి అద్దాలను సిఫారసు చేస్తారు. అవసరాన్ని బట్టి నేత్రవైద్యులతో వీడియో సంప్రదింపులు చేసి, సేవలను అందిస్తారన్నారు. కార్యక్రమంలో కుమార్‌రావు, సింబాసిస్ సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత ఒ.నరేష్, ఎన్ఎస్ఎన్ రాజు, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.